ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

- గ్రామాల్లోనే మెరుగైన వైద్యసేవలు
- విలేజ్ క్లినిక్‌లతో పాటు, ఫ్యామిలీ డాక్టర్ ద్వారా చేరువైన వైద్యసేవలు

ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. గ్రామాల్లోనే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి వైద్యరంగంలో సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగానే ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో ఒక వైఎస్సార్ హెల్త్ విలేజ్ క్లినిక్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటికి తోడు 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. విలేజ్ క్లినిక్‌లలో నిత్యం ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్) అందుబాటులో ఉండి ప్రజలకు వైద్యసేవలందిస్తున్నారు. అలాగే ప్రతీ విలేజ్ క్లినిక్‌తో పాటు గ్రామాల్లో 15 రోజులకొకసారి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించి ప్రజలకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తున్నారు. అదే రోజు ప్రతీ ఇంటిని, ఆగ్రామంలోని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, దీర్ఘకాలిక రోగులు, గర్భిణులు, బాలింతలు, విద్యార్థులు, చిన్నారులకు వైద్యతనిఖీలు చేస్తున్నారు. పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఉన్న ఊరిలోనే మెరుగైన వైద్యసేవలు అందుతుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

గజపతినగరం నియోజకవర్గంలో విలేజ్ క్లినిక్‌ల వివరాలు

మండలం	విలేజ్ క్లినిక్‌లు
బొండపల్లి	14
దత్తిరాజేరు	17
గజపతినగరం	21
గంట్యాడ	20

'ఫ్యామిలీ డాక్టర్' అమల్లోకి వచ్చిననాటి నుంచి చీపురుపల్లి నియోజకవర్గం పరిధి పీహెచ్‌సీల్లో ఇప్పటి వరకు నమోదైన ఓపీ వివరాలు

మండలం	పీహెచ్‌సీలు	ఓపీ
చీపురుపల్లి	కర్లాం	12,300
గుర్ల	తెట్టంగి, గుర్ల	36,800
మెరకముడిదాం	గర్భాం, మెరకముడిదాం	24,244
గరివిడి	కోనూరు, గరివిడి, బొండపల్లి	57,760



'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమంలో భాగంగా ప్రజలకు వైద్యసేవలందిస్తున్న బొండపల్లి మండలం దేవుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రూహీ


వేపాడ మండలం దబ్బిరాజుపేట విలేజ్ క్లినిక్‌లో వైద్యసేవలందిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ జానకి


వేపాడ మండలం జాకేరు విలేజ్ క్లినిక్‌లో రక్తపరీక్షలు చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ ఎస్.గమ్య


జామి మండలం తాండ్రంగి విలేజ్ క్లినిక్‌లో పిల్లలకు టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది


గజపతినగరం మండలం పురిటిపెంటలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్


చీపురుపల్లి మండలం నిమ్మలవలస విలేజ్ క్లినిక్‌లో రక్త పరీక్షలు చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ

వైద్యసేవలు భేష్



మాగ్రామంలోని వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ద్వారా వైద్య సేవలు చాలా బాగా అందుతున్నాయి. క్లినిక్‌లో పిల్లలకు టీకాలు కూడా వేస్తున్నారు. సుగర్, బీపీ తదితర 12 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందిస్తున్నారు. గతంలో ఏ ఆరోగ్య సమస్య వచ్చినా మాగ్రామస్తులం మండల కేంద్రంలోనికి పీహెచ్‌సీకి వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ఊరిలోనే వైద్యం అందుతోంది.

– చలుమూరి సంధ్య, తాండ్రంగి, జామి మండలం

ఇంటికి వచ్చి వైద్యం చేస్తున్నారు



విలేజ్ క్లినిక్‌ల ద్వారా గ్రామాల్లోనే రోగులకు వైద్య సేవలుఅందుతున్నాయి. 15 రోజులకొకసారి గ్రామంలో 'ఫ్యామిలీ డాక్టర్ ' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వైద్యాధికారులు, సిబ్బంది శిబిరాలు నిర్వహించడంతో పాటు ఇంటికి వచ్చి వైద్యపరీక్షలు చేస్తున్నారు. గతంలో పీహెచ్‌సీల్లో కూడా సంతృప్తస్థాయిలో వైద్యసేవలు అందేవి కాదు. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ ఇబ్బందులు తప్పాయి.

– మహంతి రమణ,గొట్లాం, బొండపల్లి మండలం

ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సిన పనిలేదు



మండల కేంద్రం మెరకముడిదాంకు మా గ్రామం 32 కిలోమీటర్ల దూరం. గ్రామంలో ఎవరికైనా అత్యవసరంగా వైద్యం అందించాలంటే అంత దూరంలోని ఆస్పత్రికి వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సివచ్చేది. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మా గ్రామంలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్ నిర్మించారు. అందులో నిత్యం ఒక ఎంఎల్‌హెచ్‌పీ ఉంటున్నారు. అనారోగ్యసమస్యలు తలెత్తితే వెల్‌నెస్ సెంటర్‌కు వెళ్లి వైద్యం చేయించుకుంటున్నాం. చాలా వరకు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సిన పనితప్పింది.

– రౌతు మధుసూదనరావు, గొళ్లలవలస, మెరకముడిదాం మండలం

క్లుప్తంగా

అమ్మవారికి అభిషేకాలు


అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి అర్చకులు ఆదివారం పంచామృతాభిషేకాలు చేశారు. ప్రతీ ఆదివారం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేకపూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని అర్చకులు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

పీఆర్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక


పీఆర్టీయూ నూతన కార్యవర్గ సభ్యులు

గజపతినగరం: మండల పీఆర్టీయూ శాఖ నూతన కార్యవర్గాన్ని స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ఆశాఖ ఉపాధ్యాయులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని పురిటిపెంట ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ తెలిపారు. నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా బందారు కుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా లెంక రామారావు, ప్రధాన కార్యదర్శిగా బి.జి.బి.ఎస్.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రావాడ రాంబాబు, జిల్లా నాయకులు రవీంద్రనాయుడు, లాల్‌బాబు, ఉపాధ్యాయుడు దిబ్బి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ సీఐకి సన్మానం


సీఐ సింహాద్రినాయుడుతో షటిల్ క్రీడాకారులు

శృంగవరపుకోట: స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి ఇటీవల విశాఖపట్నానికి బదిలీ అయిన సింహాద్రినాయుడును స్థానిక స్పార్టన్ ఇండోర్ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం సన్మానించారు. షటిల్ క్రీడాకారులు రేగలబండ అప్పారావు, మోపాడ నాయుడు, ఆర్టీసీ కోటేశ్వరరావు, సురేష్, ఆర్.శివకుమార్, వర్మ, రాంబాబు తదితరులు మాట్లాడుతూ ఎస్.కోట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా మూడేళ్లపాటు పనిచేసిన సింహాద్రినాయుడు యువకులకు ఆదర్శంగా నిలిచారని, ఆయన సేవలను కొనియాడారు.

బాధిత కుటుంబానికి అండగా ఐకాన్ గ్రూపు


నగదు, నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఐకాన్ గ్రూపు సభ్యులు

బొండపల్లి: మండల కేంద్రంలోని యాతపేటకు చెందిన నెల్లి ఈశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. పేద కుటుంబ కావడంతో మృతుడి కుటుంబానికి స్థానిక ఐకాన్ గ్రూప్ సభ్యులు అండగా నిలిచారు. మృతుడి భార్యకు రూ.50 వేల నగదు, నెలరోజులకు సరిపడా నిత్యావసర సరుకులు, పిల్లలకు, ఆమెకు దుస్తులను ఆదివారం అందజేశారు. ఐకాన్ గ్రూపు సభ్యులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

పీఆర్టీయూ జిల్లా మహిళా కార్యదర్శిగా భారతి


భారతికి నియామకపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ ప్రతినిధులు

చీపురుపల్లి: పీఆర్టీయూ జిల్లా మహిళా కార్యదర్శిగా పుర్రేయవలస ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని ఎం.వి.భారతిని నియమిస్తూ ఆసంఘం జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి రవీంద్రనాయుడు నియమించారు. స్థానిక బస్టాండ్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో ఆమెకు నియామక పత్రం అందజేశారు. ఆ సంఘం ప్రతినిధులు ఎం.జగన్నాథం,ఎం.ఎస్.ప్రసాద్, రవికిషోర్, రౌతు రాము, ఎస్.రమేష్‌నాయుడు, వెంకటమ్మ, కె.గోపి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ హితం

శృంగవరపుకోట: స్థానిక పుణ్యగిరి రోడ్డులో గ్రామదేవత దారగంగమ్మ ఆలయ ప్రాంగణం, బయట ఉన్న ఖాళీ స్థలంలో కృష్ణాపురం సాయిబాబా దేవాలయం కమిటీ సభ్యులు ఆదివారం మొక్కలు నాటారు. న్యాయవాది వారాది ఈశ్వరరావు, నెక్కల సూరిబాబు తదితరుల ఆర్థిక సహకారంతో మొక్కలకు సిమెంట్ పోల్స్, పెన్సింగ్ ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు రొంగలి జగన్నాథం, పుణ్యగిరి ఆలయం ట్రస్టుబోర్డు చైర్మన్ పి.రామకృష్ణ, కె.శ్రీనివాసరావు, జి.సత్యసాయి పాల్గొన్నారు.

ఓటర్ల నమోదులో కీలకపాత్ర పోషించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

- వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాపై బీఎల్‌ఓలు(బూత్‌లెవెల్ ఆఫీసర్లు) చేపడుతున్న ఇంటింట సర్వేలో వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ బీఎ ల్‌ఏలు (బూత్ లెవెల్ ఏజెంట్లు) పాల్గొని, తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీ, నూతన ఓటర్ల నమోదులో కీలకపాత్ర పోషించాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సూచించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి మండలాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో బీఎల్‌ఓలు ఇంటింటికీ వచ్చి సర్వే చేసే సమయంలో ఓటర్ల జాబితా ను పరిశీలించి, అందులో తప్పులను గుర్తించి వాటిని సరిచేయాలని అన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరితో ఓటు హక్కుకు దరఖాస్తు చేయించాలని, మృతి చెందిన వారిపేర్లు జాబితాలో ఉంటే తొలగించేలా చూడాలని సూచించారు.ఓటర్ల చిరునామా సరిపోయింది లేనిది, ఒక కుటుంబంలో ఓటర్లంతా ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఉన్నారా లేదా పరిశీలించి, అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. గజపతినగరం, బొండపల్లి, దత్తిరాజేరు జెడ్పీటీసీలు గార తవుడు, రాపాక సూర్యప్రకాష్, రౌతు రాజేశ్వరి, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, బొండపల్లి ఎంపీపీ చల్లా చల్లం నాయుడు, గజపతినగరం,దత్తిరాజేరు మండల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు, కడుబండి రమేష్ నాయుడు, గజపతినగరం పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, సీనియర్ నాయకులు మంత్రి అప్పలనాయుడు, మండల సురేష్, బెల్లాన త్రినాథరావు, రేగ సురేష్(గోవింద), మిత్తిరెడ్డి రమేష్, కర్రి కృష్ణ, పి.నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తీరిన ఇక్కట్లు

- రూ.98 లక్షలతో దత్తి బీటీ రోడ్డు పునరుద్ధరణ


కోమటిపల్లి-గర్భాం రోడ్డు నుంచి దత్తి గ్రామానికి పునరుద్ధరించిన తారురోడ్డు

దత్తిరాజేరు: మండలంలోని దత్తి గ్రామ తారు రోడ్డు పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయి. ఎన్నో ఏళ్లక్రితం ఈ రోడ్డు పూర్తిగా గోతులమయం కావడంతో ఈ మార్గంలో ప్రయాణాలు సాగించేందుకు దత్తి గ్రామస్తులతో పాటు చుక్కపేట, గుచ్చిమి, డి.వెంకటరాపురం ,రామచంద్రాపురం, షికారుగంజి గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడాల్సివచ్చేది. గత ప్రభుత్వంలో ఈ సమస్య పరిష్కారం కాలేదు. రోడ్డు పునరుద్ధరణ చేపట్టాలని దత్తితో పాటు చుట్టు పక్క గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్యను కోరారు. ఆయన స్పందించి ఏఎంసీ నిధులు రూ.98 లక్షలు మంజూరు చేయించారు. కొద్ది రోజుల క్రితమే కోమటిపల్లి-గర్భాం రోడ్డు నుంచి దత్తి గ్రామానికి 4 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు పునరుద్ధరణ పనులు ప్రారంభించి పూర్తి చేశామని ప్రాజెక్ట్ డీఈ అప్పలనాయుడు తెలిపారు. పనులు పూర్తి కావడంతో దత్తి,చుక్కపేట, గుచ్చిమి, డి.వెంకటరాపురం, రామచంద్రాపురం, షికారుగంజి గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


గతంలో గోతులతో అధ్వానంగా ఉన్న దత్తి రోడ్డు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ హైమావతి


మాట్లాడుతున్న ఎంపీపీ పీరుబండి హైమావతి

గంట్యాడ: వర్షాలు కురుస్తున్నందున డెంగీ, మలేరియా, చికున్ గున్యా, వైరల్ జ్వరాలు తదితర సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తం గా ఉండాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీపీ పీరుబండి హైమావతి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. వ్యవసాయం, వైద్యారోగ్యం, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, గృహనిర్మాణం, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖలపై ఎంపీపీ సమీక్ష నిర్వ హించారు. ఆయా శాఖల్లో ప్రగతిని అధికారులు సభకు వివరించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను రైతు భరోసాకేంద్రాల్లో సిద్ధంగా ఉంచాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. గ్రామాల్లో ఎక్కడైనా సీజనల్ వ్యాధులు ప్రబలితే వెంటనే వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యసేవలందించాలని చెప్పారు. గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించే ముందు స్థానిక ఎంపీటీసీ, సర్పంచ్‌లకు సమాచారం ఇవ్వాలని వైద్యాధికారులకు సూచించారు. ఎక్కువ మంది ప్రజలు ఫ్యామిలీ డాక్టర్ సేవలను వినియోగించుకునేలా చూడాలని, పీహెచ్‌సీల్లో, విలేజ్ క్లినిక్‌ల్లో వైద్యసిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు దృష్టి పెట్టాలని, దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయించాలని తెలిపారు. మండలంలో ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్న రహదారులను పరిశీలించి, పాడైన రోడ్లకు మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. వైస్ ఎంపీపీ కిలపర్తి వెంకటలక్ష్మి, ఎంపీడీఓ భానోజీరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు

మండల సర్వసభ్య సమావేశం

బొండపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చల్లా చలంనాయుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10: 30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.వి.రాజేంద్ర ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

పెదకాదలో 'గడప గడపకు మనప్రభుత్వం'

దత్తిరాజేరు: మండలంలోని పెదకాద గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం సోమవారం ఉదయం నిర్వహించనున్న ట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య పాల్గొని ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలిసుకుంటారని పేర్కొన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, సంబంధిత సచివాలయ సిబ్బంది పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

స్పందన

మెరకముడిదాం: ప్రజాసమస్యల పరిష్కార వేదిక 'స్పందన' కార్యక్రమాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.రత్నం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు హాజరవుతారని, ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని సూచించారు.

శింగరాయిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

వేపాడ: మండలంలో శింగరాయి గ్రామంలో సోమవారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు నేతృత్వంలో నిర్వహించనున్నట్లు ఎంపీపీ సత్యవంతుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జగ్గుబాబు ఆదివారం తెలిపారు. మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గృహసారధులు, సచివాలయకన్వీనర్లు హాజరు కావాలని కోరారు.

రూ.9.50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం


సీసీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుర్ల: మండల కేంద్రంలోని రాజావీధిలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిధులు రూ.9.50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు ఇజ్జిరోతు ప్రసాద్ తెలిపారు. గతంలో మండల కేంద్రంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించే సమయంలో సమస్యను స్థానికులు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లారు. సీసీ రోడ్డు నిర్మిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం మంజూరు చేసిన 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధుల నుంచి రూ.9.50 లక్షలు సీసీరోడ్డుకు కేటాయించారు.రాజావీధి నుంచి గరికివలస రోడ్డు వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ప్రారంభించారు. రెండు రోజుల్లో సీసీ రోడ్డు పనులు పూర్తి చేస్తామని వారు చెప్పారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ కలయికలో శ్రీరామ్ హైస్కూల్ 1985 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి శ్రీరామ్ హైస్కూల్‌లో 1985లో పదోతరగతి చదువుకున్న వారంతా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పేరిట గరివిడిలోని సీతారామ కల్యాణ మండపం వేదికగా ఆదివారం కలుసుకున్నారు. హైస్కూల్ చదువు అనంతరం ఉన్నత చదువులు పూర్తి చేసుకుని ఎక్కడెక్కడో వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా 38 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో పాతజ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కుటుంబ జీవితం, కష్టసుఖాలు పరస్పరం తెలుసుకున్నారు. సాయంత్రం వరకు సందడిగా గడిపారు. తాము చదువుకున్న హైస్కూల్‌ను సందర్శించి, పాఠశాల ఆవరణలో ఫొటోలు దిగారు.

31న చలో కలెక్టరేట్


వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

శృంగవరపుకోట: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంటలు చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 31వ తేదీన చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు. సంబంధిత వాల్‌పోస్టర్లను స్థానిక మహాత్మా గాంధీ పార్కులో ఆదివారం ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ మధ్యాహ్నభోజన కార్మికుల వేతనాలు, మెనూ చార్జీలు పెంచాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాడి అప్పారావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్, నాయకులు ఎర్ర దేముడమ్మ, ఎ.భవాని,సీహెచ్ రాఘవి, లక్ష్మీ పాల్గొన్నారు.

భారీ వర్షం


ఎల్.కోట జంక్షన్ సమీపంలో కురుస్తున్న వర్షం

కొత్తవలస/లక్కవరపుకోట: కొత్తవలస, లక్కవరపుకోట మండలాల్లో ఆదివారం మధ్యాహ్నం భారీవర్షం కురిసింది. వరద నీరు చెరువుల్లో చేరుతుండడంతో జలకళ సంతరించుకుంటున్నాయి. కొత్తవలస రైల్వే అండర్ బ్రిడ్జిని వరదనీరు ముంచెత్తడంతో రాకపోకలకు ఆటంకం కలిగింది. కొత్తవలస జంక్షన్‌లో ముడుకు లోతును వరదనీరు నిలిచిపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు.

చెరువులకు జలకళ


కొమ్ముపారుతున్న బానాది చెరువు

వేపాడ: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో చెరువుల్లో జలకళ సంతరించుకున్నాయి. వేపాడ, వల్లంపూడి, బానాది, చినగుడిపాల, బల్లంకి, దబ్బిరాజుపేట జగ్గయ్యపేట తదితర గ్రామాల్లోని చెరువులు కొమ్ముపారుతున్నాయి. జగ్గయ్యపేట, జాకేరు, కరకవలస, భర్తవానిపాలెం, బల్లంకి, బానాది, వావిలపాడు నల్లబిల్లి, వీలుపర్తి తదితర గ్రామాల్లో రైతులు దమ్ములు ప్రారంభించారు.